www.prajasakti.com

ప్రజాశక్తి

వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎంపై చర్యలు

ప్రజాశక్తి - కరప

విద్యార్థినులపై లైంగిక వేధింపులు పాల్పడిన హెచ్‌ఎం కాశీ విశ్వేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని గొర్రిపూడి హైస్కూల్‌ను ఐద్వా నాయకురాలు జి.భూలక్ష్మితో కలిసి ఆమె సందర్శించారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను కలిసి వేధింపుల సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కాశీవిశ్వేశ్వరరావు తమపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో అయిదుగురు విద్యార్థినులు తల్లిదండ్రుల సహకారంతో పోలీసు ఆశ్రయించడం జరిగిందని తెలిపారు. వారికీ న్యాయం చేయాలని కోరారు. బాధ్యుడైన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్యాలెట్లను కట్టలు కడుతున్న సిబ్బంది

కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సర్వత్రా ఉత్కంఠ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

- కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపు
- రాత్రి 8 గంటలకు కట్టలు కట్టడం పూర్తి
- కౌంటింగ్ ఆలస్యంతో టిడిపి, పిడిఎఫ్ నేతల్లో టెన్షన్
- పోలైన పోస్టల్ ఓట్లు 243లో 201 చెల్లుబాటు
- రౌండ్‌కు 28 వేల ఓట్ల చొప్పున 8 రౌండ్లలో కౌంటింగ్

తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠ రేపుతోంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంద కొడిగా సాగడంతో టిడిపి, పిడిఎఫ్ నేతలు, కార్యకర్తల్లో టెన్షన్ నెల కొంది. సోమవారం ఉదయం ఏడు గంటలకు సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లను తెరి చారు. బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ గదిలోకి చేర్చి ఉదయం ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. మొత్తం 28 టేబుల్స్ ఏర్పాటు చేయగా ప్రతి రౌండ్‌లోనూ 10 నుంచి 13 వేల ఓట్లకు సంబంధించి కట్టలు కట్టడం ప్రారంభించారు. చెల్లుబా టు, చెల్లుబాటు కానివాటితో సంబంధం లేకుండా 50 ఓట్ల చొప్పున కట్టలుగా కట్టారు. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 35 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు మొదలుపెట్టిన కట్టలు కట్టే ప్రక్రియ రాత్రికి 17 రౌండ్లలో పూర్తయ్యింది. ఆ తర్వాత ప్రాధాన్యతా ఓట్ల క్రమంలో లెక్కింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. మంగళవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో లెక్కింపు పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మూడు షిఫ్టులుగా మొత్తం 700 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డిఆర్ఒ విశ్వేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు నిరంతరం కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరినీ తనిఖీ చేసి పాసులు ఉన్నవారిని మాత్రమే లోపలికి పంపించారు.

కృష్ణా, గుంటూరు స్థానంలో వేగంగా.. ఇక్కడ ఆలస్యంగా..★★★

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. అక్కడ సైతం సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. అక్కడ 25 మంది అభ్యర్థులు బరిలో ఉండగా దాదాపు 3.40 లక్షల ఓట్లు పోలయ్యాయి. అక్కడ ఓట్ల లెక్కింపు వేగంగా జరగడంతో సాయంత్రం ఐదు గంటల నుంచి రౌండ్లవారీగా ఫలితాలు ప్రకటించడం ప్రారంభమైంది. ఇక్కడ మాత్రం కట్టలు కట్టడానికే దాదాపు 12 గంటల సమయం పట్టింది. దీంతో అక్కడ వేగంగా జరగడానికి, ఇక్కడ ఆలస్యం జరగడానికి కారణాలు ఏమిటని ప్రశ్నలు అందరినీ తొలిచేశాయి. కౌంటింగ్ ప్రక్రియ మందకొడిగా సాగుతుందనే విమర్శలు వెల్లువెత్తాయి. రాత్రి ఎనిమిది గంటల తర్వాత కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవ్వడంతో ఏజెంట్లు, అభ్యర్థులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం 28 టేబుల్స్ ఉండగా ప్రతి రౌండ్‌కూ టేబుల్‌కు వెయ్యి చొప్పున 28 వేల ఓట్లు లెక్కించనున్నారు. మొత్తం ఎనిమిది రౌండ్లలో పూర్తిస్థాయి ఫలితం వెలువ డనున్నట్లు అధికారులు చెబు తున్నారు. పూర్తిస్థాయి ఫలితం వచ్చేటప్పటికి సమ యం ఎక్కువ పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పోస్టల్ ఓట్లు 201 చెల్లుబాటు★★★

పోస్టల్ ఓట్లకు సంబంధించి 408 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 243 మందే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 201 ఓట్లు చెల్లుబాటయ్యాయి. 42 ఓట్లు చెల్లుబాటు కానివిగా తేల్చారు. ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌లో దాదాపు 27 వేల మంది ఉద్యోగులు, మూడు వేలకు మందికిపైగా పోలీసులు పాల్గొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవాల్సి ఉంది. అయితే కేవలం 243 మందే ఓటు హక్కు వినియోగించుకోవడం చర్చనీయాంశమైంది.

బ్యాలెట్ బాక్సులు తీసుకొస్తున్న సిబ్బంది

టిడిపి, పిడిఎఫ్ నేతల్లో ఉత్కంఠ.★★★

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో టిడిపి, పిడిఎఫ్ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. గెలుపుపై ఎవరి అంచనాలు వారు వేస్తున్నారు. ఎవరికివారు గెలుపుపై ధీమాగా ఉన్నారు. తొలి రెండు, మూడు రౌండ్లలో ఫలితా న్ని బట్టి ఎవరు గెలుస్తా రనేది అంచనాకు వచ్చే అవకాశం ఉంది. టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజ శేఖరం, పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు కౌంటింగ్ హాలులోనే ఉన్నారు.

భారీ బందోబస్తు★★★

ఏలూరు స్పోర్ట్స్: ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ స్పష్టం చేశారు. కౌంటింగ్ హాలు వద్ద భద్రతను ఆరుగురు డిఎస్‌పిలు, ఆరుగురు సిఐలు, 22 మంది ఎస్‌ఐలు, 38 మంది ఎఎస్‌ఐలను, 55 మంది కానిస్టేబుళ్లను, 37 మంది హోం గార్డులను నియమించినట్లు తెలిపారు. ఎస్‌పి వెంట ఎఎస్‌పి సూర్యచంద్రరావు ఉన్నారు.

పిహెచ్‌సి వద్ద ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ నాయకురాలు బేబిరాణి

'హెల్త్ సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలి'

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలో కాట్రావులపల్లి పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ కనకరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబిరాణి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పిహెచ్‌సి ఎదుట ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిహెచ్‌సిలో పని చేస్తున్న ఆశ వర్కర్లను సూపర్‌వైజర్ కనకరాజు దుర్భాషలాడుతున్నారని అన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు తెలియచేశామని అన్నారు. అయితే కనకరాజును సూరంపాలెం సిహెచ్‌సికి బదిలీ చేశారని, ఆయనతో కుమ్మక్కైన వైద్యుడు శివబాబు కెపి.పురం సిహెచ్‌సికి బదిలీ చేశారని తెలిపారు. అయితే పిహెచ్‌సిలోనే వారు ఉండటం వల్ల ఆశలకు వేధింపులు తప్పేట్లు లేవని అన్నారు. కావున హెల్త్ సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయడంతోపాటు, వైద్యుడు శివబాబును వేరే పిహెచ్‌సికి బదిలీ చేయాలని ఆమె డిమాండ్ ఏశారు. అదేవిధంగా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వీరిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమల్ల పద్మ, నియోజకవర్గ పరిధిలోని ఆశ వర్కర్స్ పాల్గొన్నారు

సైన్స్ పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక సాలిపేట పైండా సత్తిరాజు మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో సైన్స్ పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు సోమవారం నిర్వహించారు. వికసిత్ భారత్‌లో విజ్ఞానం, నూతన ఆవిష్కరణలలో గ్లోబల్ నాయకత్వానికి భారత యువతను శక్తివంతం చేయడం అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటిలకు 32 పాఠశాల నుంచి 218 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి ఎమ్. శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, హెచ్‌ఎం జె.సుబ్బలక్ష్మి, విఎస్‌వి.రమణమూర్తి పోటీలను నిర్వహించారు.

నేడు జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు

మంగళవారం పైండా సత్తిరాజు మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస వినీల్ తెలిపారు. ఆదివారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో 2356 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వారినుంచి వందమందిని ఎంపిక చేసి మంగళవారం జిల్లా స్థాయి క్విజ్ నిర్వహిస్తామన్నారు. విజేతలకు డిఇఒ పిల్లి రమేష్, సమగ్ర శిక్ష ఎపిసి వేణుగోపాల్‌రావు చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - కాకినాడ

బాధితుడితో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

స్థానిక వార్పు రోడ్డులో జయ బాలాజీ పార్శిల్ సర్వీస్‌లో జరిగిన పేలుడు ప్రమాదంలో గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం, నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం సిఐటియు బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, మెస్ కృష్ణ మాట్లాడుతూ జయ బాలాజీ పార్సిల్ సర్వీస్‌లో పార్సిల్ బాక్స్‌లను కిందకి దించే క్రమంలో పేలుడు సంభవించి ఐదుగురు కార్మికులు ప్రమాదానికి గురయ్యారన్నారు. ప్రమాదానికి గురైన వారిలో గజ్జల మధు, మేడిశెట్టి లోవరాజు, బొందు అశోక్, ధారా నాగేష్, బంధాల పోతురాజు ఉన్నార న్నారు. వీరికి యాజమాన్యం, ప్రభుత్వం మెరుగైన వైద్య సౌకర్యం అందించి తగు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన పేలుడు పదార్థాలు పార్సిల్ బుక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండడానికి పటిష్టమైన తనిఖీలు నిర్వహించి భద్రతా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. జట్టు కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ఆ సంక్షేమ బోర్డు ద్వారా వారికి సంక్షేమ ఫలాలు అందించాలన్నారు.

రత్నగిరిపై తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - శంఖవరం

కొండపై నుంచి వస్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న బస్సు

అన్నవరం సత్యదేవుని దేవస్థానంలో ఒక పెళ్లి బృందానికి బృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలావున్నాయి..రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఒక పెళ్లి బృందం వ్యానులో అన్నవరం సత్యదేవుని దేవస్థానంలో సోమవారం తెల్లవారుజామున సత్యగిరి కొండపై వివాహం నిర్వహించుకున్నారు. తిరుగు ప్రయాణంలో అక్కడ నుంచి ఘాటు రోడ్డులో కొండ దిగువకు వ్యాన్‌లో బయలుదేరారు. ఈ క్రమంలోనే కొద్దిదూరం ప్రయాణించిన తరువాత ఆ వ్యానుకు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంగా ఘాటు రోడ్డు డివైడర్‌కి ఢీకొట్టడంతో అక్కడ ఉన్న విద్యుత్ స్తంభానికి తగిలి వ్యాను నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న పెళ్లి బృందంలో కొంతమంది స్వల్పంగా గాయాలపాలయ్యారు. దీంతో వ్యాన్‌లో ఉన్న పెళ్లి బృందం ఊపిరి పీల్చుకున్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి గ్రామ టిడిపి అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి కుటుంబానికి ఎంపి గంటి హరీష్‌మాధుర్ రూ.1,00,000 సాయాన్ని అందజేశారు. అమలాపురంలో సోమవారం జరిగిన జిఎంసి. బాలయోగి వర్ధంతి కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకుల విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చేతుల మీదుగా ఎంపి హరీష్‌మాధూర్ సమకూర్చిన రూ.లక్ష చెక్కును చంద్ర మౌళి సతీమణి వరలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, నాయకులు ధూళిపూడి బాబి, జక్కల ప్రసాద్‌బాబు, మోర్త భైరవమూర్తి, బోయిడి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఫైరింగ్ శిక్షణలో ఎస్‌పి బిందుమాధవ్

ప్రజాశక్తి - పెద్దాపురం

శిక్షణా కేంద్రంలో షూట్ చేస్తున్న ఎస్‌పి

స్థానిక ఎడిబి రోడ్డులో ఉన్న ఫైరింగ్ మెట్ట వద్ద సోమవారం సాయుధ దళాల వార్షిక మొబలైజేషన్ ఫైరింగ్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో ఎస్‌పి బిందుమాధవ్ పాల్గొని ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ఈ శిక్షణలో ఎకె 47, ఎస్‌ఎల్‌ఆర్, ఎం5 తదితర లాంగ్ రేంజ్ ఆయుధాల ఫైరింగ్ వినియోగం, షార్ట్ రేంజ్ ఆయుధం 9 ఎంఎం పిస్టల్ ఫైరింగ్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు స్థలం కేటాయింపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెం మార్కెట్‌కు అవసరమైన స్థలాన్ని యానాం-ద్రాక్షారామ రోడ్డులో కేటాయించారు. మండలంలోని సుంకరపాలెం, కనకాలపేట ప్రధాన రహదారిలో ఉన్న చేపల మార్కెట్ వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని ఆదివారం స్థానికంగా జరిగిన ఓ కార్యక్రమంలో స్థానికులు పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దీంతో సుంకరపాలెం, కనకాలపేట గ్రామాలకు చెందిన పెద్దలు కలిసి సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావును కోరారు. దీంతో ఆయన యానం, ద్రాక్షారామ రోడ్డులోని 10 సెంట్లు భూమిని మార్కెట్‌కు కేటాయించారు. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ మార్కెట్‌ను యానం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కోనకొండ బాబు ప్రారంభించారు.

6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌మీడియట్‌లో చేరే విద్యార్థులు ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు గురుకుల విద్య గొప్ప వరం వంటిదని అన్నారు. ఈ అవకాశాన్ని ఆయా సామాజికవర్గాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని చంద్రబాబుకు వినతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి చంద్రబాబును ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ కోరారు. సోమవారం ఆమె చంద్ర బాబును కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్తిపాడులో సిహెచ్‌సిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఏలేశ్వరంలో ఉన్న అప్పనపాలెం బ్రిడ్జి నిర్మాణం, రహదారులు, పాఠశాలకు ప్రహరీ గోడలు నిర్మించాల్సివుందని తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటుకు నిధులు వెచ్చించాలని కోరారు.

వేధింపులపై గోప్యంగా విచారణ

ప్రజాశక్తి - సామర్లకోట

విచారణ చేస్తున్న అధికారుల బృందం

మండలంలోని వేట్లపాలెం జడ్‌పి హైస్కూల్లో లైంగిక వేధింపులపై అధికారుల బృందం గోప్యంగా విచారణ నిర్వహించింది. లైంగిక వేధింపులపై వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాలతో ఐసిడిఎస్ పీడీ విజయ కుమారి, సమగ్ర శిక్ష జిసిడిఓ ఉమామహేశ్వరి, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, సిడిపిఒ జి.ఉష తదితరుల బృందం సోమవారం విచారణ నిర్వహించింది. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఎం.శేషుబాబు 8వ తరగతి విద్యార్థినులను లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ని వేట్లపాలెం హైస్కూల్‌కు రప్పించి విచారణ చేశారు. అలాగే వేట్లపాలెం హైస్కూల్లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ మీద వచ్చిన ఎస్‌వి.రమణ సైతం 6వ తరగతికి చెందిన విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుపైనా ఈ బృందం విచారించింది. ఇద్దరి ఉపాధ్యాయుల తీరుపై విద్యార్థులను వివరాలు సేకరించార. దీనిపై తుది నివేదికను డిఇఒకు అందజేస్తామని వారు తెలిపారు. ఈఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పి.అనురాధ పాల్గొన్నారు.

సత్యదేవునికి రూ.1.88 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యదేవునికి హుండీల ఆదాయం రూ.1.88 కోట్లు వచ్చింది. సోమవారం కొండపైన ఇఒ వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ ఐవి.రోహిత్ సమక్షంలో అధికారులు 31 రోజుల్లో వచ్చిన వివిధ హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.1,88,91,940 ఆదాయం లభించింది. నగదుతో పాటు 66.10 మిల్లీగ్రామ్ బంగారం, 693 గ్రాములు వెండి, వివిధ దేశాల చెందిన కరెన్సీ లభించింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు, వివిధ విభాగాల ఎఇలు, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ట్రంప్ తొలి కేబినెట్ భేటీ!

ప్రశ్నించే మీడియా సంస్థలకు నో ఎంట్రీ

దీక్షలకు మద్దతుగా కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

డ్రైవర్‌పై వేసిన సెస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆర్‌టిసి ఉద్యోగ సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలకు మద్దతుగా కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఏలేశ్వరం డిపోలో పని చేస్తున్న డ్రైవర్ ఎస్‌వి.రమణను కొద్ది రోజుల క్రితం ఆర్‌టిసి అధికారులు సస్పెండ్ చేశారు. గత కొన్ని రోజులుగా కార్మికులు భోజన విరామ సమయంలో జెఎసి ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో జెఎసి ఆధ్వర్యంలో రిలే నిరహారదీక్షలు జరుగుతున్నాయి. ఈ దీక్షలకు మద్దతుగా సోమవారం భోజన విరామ సమయంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ గత 10 రోజులుగా కార్మికులందరూ ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తూ భోజన విరామ సమయంలో గేటు ధర్నాలు చేపడుతున్న కనీసం యాజమాన్యంలో చలనం లేదన్నారు. ఈ నేపథ్యంలో రిలే దీక్షలు చేపట్టామన్నారు. ఆర్‌టిసి చట్టం 1/2019 విరుద్ధంగా సస్పెండ్ చేసిన డ్రైవర్ రమణను వెంటనే విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌ఎంయు కార్యదర్శి కె.త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి యుబిఎం. కుమార్, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నేకూరి ప్రకాశరావు నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతిలో మాట్లాడుతున్న శిక్షకులు

ముగిసిన ఆన్‌లైన్ ప్రామాణికత కోర్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్యలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన 'ఎఫ్‌పిజితో డిజిటల్ హార్డ్వేర్ ఇంజనీరింగ్' అనే ఆన్‌లైన్ ప్రామాణికత కోర్సు విజయవంతంగా ముగిసింది. ఈ కోర్సులో ఎఫ్‌పిజి సాంకేతికత పరిచయం, డిజిటల్ డిజైన్ మూలసూత్రాలు, ఎఫ్‌పిజి ఆకృతిశిల్పన విధానం, వేరిలాగ్ ప్రోగ్రామింగ్, సంక్లిష్ట తార్కిక రూపకల్పన, క్రమానుగత తార్కికం, అంతిమ స్థితి యంత్రాలు (ఎఫ్‌ఎస్‌ఎం), మరియు వేరిలాగ్ లో అనుకరణ మరియు పరీక్షా వాతావరణం వంటి ముఖ్యమైన అంశాలపై నిపుణపులు విశ్లేషించారు. ఆదిత్య విశ్వవిద్యాలయం అంతర్జాతీయ సంబంధాల సమన్వయకర్త డాక్టర్ మొహమ్మద్ తాజ్ ముఖ్య వక్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్స్) డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పరిశీలనను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

గతంలో ఇళ్ల పట్టాలు పొందిన వారి వివరాల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహశీల్దార్ కాంతారావు ఆదేశించారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో విఆర్‌ఒలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో 4.225 మంది ఇళ్ల పట్టాలు పొందారని తెలిపారు. ఇళ్ల పట్టాల లబ్ధిదారుల పరిశీలన పూర్తి చేయవలసి ఉందన్నారు. అలాగే 397 మంది పొజిషన్ పట్టాలు పొందారని, వీరి వెరిఫికేషన్ కూడా పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో భూములు ఉన్న రైతులందరి నమోదు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో విఆర్‌ఒలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మండలి లైవ్ ప్రసారాలపై ఆంక్షలు తగవు

ప్రజాశక్తి - కాకినాడ

ఎపి శాసన మండలి సమావేశాల్లో జరుగుతున్న చర్చలపై లైవ్ ప్రసారాలపై ఆంక్షలు తగదని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చట్టసభల్లో ఎవరు ఉన్నా లేకున్నా చర్చ జరుగుతున్న తీరు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. . తక్షణమే అసెంబ్లీ, మండలి సమావేశాల లైవ్ ప్రసారాలను అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో జీవితఖైదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

2021లో సిటిఆర్ఐ వద్ద జరిగిన హత్య కేసులో నిందితుడు యర్రా సాయికి జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రాజమహేంద్రవరం సిటిఆర్ఐకు చెందిన జీరి వెంకటసత్యనారాయణరెడ్డికి, యర్రా సాయికి పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2021 సెప్టెంబర్ 25వ తేదీ తెల్లవారు జామున యర్రా సాయి చాకుతో తొటయ్యరెడ్డిపై దాడికి దిగాడు. చాకుతో పొడిచి పక్కనే ఉన్న సర్వే కర్రతో తలపై బలంగా కొట్టాడు. అనంతరం రాయితో మోది హత్య చేశాడు. దీనిపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో సిఐ మధుబాబు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితునికి జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా, జరిమానా కట్టలేని పక్షంలో మరో 6 నెలలు సాధారణ జైలు విధించారు. ఈ కేసులో నిందితునికి శిక్షణ పడేలా కృషి చేసిన అడిషనల్ పిపి కె.రాధాకృష్ణరాజు, 3 టౌన్ సిఐ వి.అప్పారావు, కానిస్టేబుల్ జి.వెంకటేశ్వర్లును ఎస్పి డి.నరసింహకిషోర్ అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామ పరిధిలోని పోలవరం కాలువ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభించింది. సోమవారం సంఘటనా స్థలాన్ని ఎస్పి బిందు మాధవ్, డిఎస్పి పాటిల్ దేవరాజ్మనీష్, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ సందర్శించారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు ఎస్ఐ, సిఐలకు తెలియ చేయాలని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. 2 రోజుల క్రితం ఎక్కడో హత్య చేసి ఈ ప్రాంతంలో మృతదేహాన్ని పడవేసినట్లు తెలుస్తోంది.

అక్రమ మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - అంబాజీపేట, రావులపాలెం

పి.గన్నవరం, రాజోలు సర్కిల్ పరిధిలో స్వాధీనం చేసుకున్న రూ.90 లక్షల విలువైన మద్యాన్ని అంబాజీపేట మార్కెట్ యార్డులో సోమవారం ధ్వంసం చేశారు. కొత్తపేట డిఎస్పి ఎస్.మురళీమోహన్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కెడి.వి.ప్రసాద్ సమక్షంలో ఈ అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశారు. అనంతరం డిఎస్పి మీడియాతో మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటి వరకు ఏడు పోలీస్ స్టేషన్ల పరిధిలో 9,124 అక్రమ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిఎస్పి పి.ప్రదీప్, పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు, రాజోలు సిఐ నరేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రావులపాలెం: గతంలో స్వాధీనం చేసుకొన్న మద్యం, సారాను సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎం.శేఖర్బాబు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. రూ.15 లక్షల మద్యాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జి.సురేంద్ర, కె.అశోక్, ఎం.రాము, రెవెన్యూ అధికారులు కొండేటి సత్యప్రసాద్, చింతపర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 15 మందికి గైర్హాజరు

ప్రజాశక్తి - తాళ్లపూడి, చాగల్లు

సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షకు తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో 15 మంది విద్యార్థులు గైర్హాజర్యారు. తాళ్లపూడిలో 11 మంది విద్యార్థులు గైర్హజరయినట్లు ఎగ్జామ్ చీఫ్ గోపినాథ్ తెలిపారు. వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 205 మంది విద్యార్థులకు పరీక్షలు రాయాల్సి ఉండగా, 194 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

చాగల్లు శ్రీవేంగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం 101 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా నలుగురు విద్యార్థులు పరీక్షలు గైర్హాజరు అయినట్లు 97 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కే పావని తెలిపారు. పరీక్షా కేంద్ర వద్ద సిటింగ్ స్క్వాడ్ పెట్టినట్లు ఆమె తెలిపారు

మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తాడిపూడి గ్రామంలో ఐదుగురు యువకులు గోదావరిలో పడి మృతి చెందారు. వీరి కుటుంబాలను కాపు జెఎసి రాష్ట్ర నాయకులు గట్టి గురునాధం తదితరులు సోమవారం పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.30వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడారు. ఘటన జరిగి ఆరు రోజులైనా నేటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఒక్కో మృతుని కుటుంబానికి రూ.25 లక్షల రూపాయల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు చిన్న చిన్న సంఘటనలపై తక్షణం స్పందించిన ఉప ముఖ్యమంత్రి జనసేన నాయకులు పవన్ కళ్యాణ్ నేటి వరకు యువకుల మృతిపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో తోట రామకృష్ణ, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, తాడిపూడి సర్పంచ్ నామా గోపాలం, తాళ్లపూడి మండల కాపు సంఘం అధ్యక్షులు నామా ప్రకాశం, జిల్లా నాయకులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు, కరిబండి త్రినాధస్వామి, వనిమిరెడ్డి శ్రీను, మండిగ గిరి పాల్గొన్నారు.

లింగ సమానత్వంపై వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి -దేవరపల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం దేవరపల్లిలో గల మహాత్మా స్కూల్ లో పురుషుల లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో పురుషుల ఆవశ్యకత, పితృస్వామ్య వ్యవస్థలో ఎదురయ్యే సవాళ్ళు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం, స్కూల్ యాజమాన్యం, ఎన్ఎస్ఐ కె.నాగభూషణం, మహిళా కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు

కడియం మసీదులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - కడియం

రంజాన్ మాసం నేపథ్యంలో కడియంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం కమిటీ ప్రెసిడెంట్ షేక్ సలీం, సెక్రెటరీ సర్వార్ భాషా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం మసీదులో ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా షేక్ సలీం మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో ఉపవాసాలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ముస్లిములు, మత పెద్దలు పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ఆసుపత్రి అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రిలో పనులు ఏమేమి మంజూరు అయ్యాయి? ఎంతవరకు పూర్తి అయ్యాయి? ఎప్పటికీ పూర్తి అవుతాయి? వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపి

ఎంఎస్ఐడిసి ఇఇ సిహెచ్.రత్నరాజు, జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి డాక్టర్ ఎస్.స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న పశువైద్యుడు

పలు చోట్ల పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - శంఖవరం, పెద్దాపురం

శంఖవరంలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్లో భాగంగా లేగ దూడల ప్రదర్శన, పశువులకు గర్భకోశ వ్యాధులపై పశువైద్యాధికారులు పశువులను పరీక్షించారు. దూడలకు కాల్షియం, లివర్ టానిక్స్, మినరల్ మిక్సర్ బ్లాక్స్, పాల క్యాన్స్ ప్రోత్సాహక బహుమతులుగా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీతల మనోజ్కుమార్, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, డాక్టర్ కె.ప్రసాద్, డాక్టర్ టి.లావణ్య, డాక్టర్ ఎం.వీరరాఘవరావు, డాక్టర్ సిఆర్.విభ, పశుగణాభివృద్ధి సంస్థ వైద్యులు డాక్టర్ కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని జి.రాగంపేటలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశు సంవర్ధక శాఖ జెడి ఆర్.వెంకటేశ్వరరావు, డిడి అంబేద్కర్, ఎడిటి ఎ.రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో పశు వైద్యాధికారి మస్తాన్ బి, సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అలాగే దూడలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పి.దుర్గాప్రసాద్, పి.గంగరాజు, కె.రాజు, పి.ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.

పంటను పరిశీలిస్తున్న ఎస్ఇ

సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

శివారు ప్రాంత పంట పొలాలకు సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు ధవలేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ గోపీనాథ్ తెలిపారు. సోమవారం మండలంలోని పత్తిగొంది, మూల పొలం, గ్రాంటు, చినతూరతిప్ప ఎండిపోతున్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ధవలేశ్వరం ఈస్టర్న్ డివిజన్ ద్వారా 200 క్యూసెక్కులు నీరు అదనంగా విడుదల చేస్తామని అన్నారు. మసకపల్లి లాకుల వద్ద 7.0 అడుగుల నీటిమట్టం మైంటైన్ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం మూడు రోజులు వంతు పూర్తయిందని, మరో మూడు రోజులు పాటు తాళ్ళరేవు సెక్షన్కి నీటి వంతు కేటాయించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఇఇ రామకృష్ణ, ఎఇ అనూష, డిసి ఛైర్మన్ భాస్కరరాజు, పోలేకుర్రు నీటి సంఘం అధ్యక్షులు అల్లూరి రామకృష్ణరాజు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు కష్టాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మాట్లాడుతున్న ముద్రగడ గిరిబాబు

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు కష్టాలే మిగిలాయని నియోజకవర్గ వైసిపి ఇన్ఛార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు. సోమవారం మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, నేటి కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను పక్కకు పోయాయని అన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామిశెట్టి నాని, బంకు శ్రీను, జువ్వల చినబాబు, గుడాల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న ఇల్లు కూల్చివేత

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన మెండి గంగారావు ఇంటిని నిర్మించుకుంటున్నాడు. దీంతో కొందరు ఆ ఇంటిపై దాడి చేసి జెసిబితో కూల్చేశారు. దీంతో గంగారావు దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అచ్చంపేట పాత రామాలయం వీధిలో ఓ గుడిసెలో కొన్నేళ్లుగా ఈ దంపతులు జీవనం సాగిస్తున్నారు. గుడిసె స్థానంలో పక్కా గృహాన్ని నిర్మించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ గృహం శ్లాబ్ దశకు చేరుకుంది. అయితే ఆదివారం ఆకస్మాత్తుగా ఈ స్థలం తమదంటూ గ్రామానికి చెందిన పలువురు వచ్చి వారిపై దాడి చేయడంతోపాటు, శ్లాబ్ సెంట్రింగ్ పనుల కోసం అమర్చిన కర్రలను కూలగొట్టారు. ఇదేమని ప్రశ్నించిన తమపైనా దాడి చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చశారు. ఆ దృశ్యాలను సెల్ఫోన్లో చిత్రీకరిస్తున్న వారిపైనా దాడిచేసి సెల్ఫోన్ లాక్కొని నేలకేసి

కొట్టేశారు. ఈ ఫిర్యాదుపై సిఐ కృష్ణ భగవాన్ ఆదివారం రాత్రి సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. దీనికి పాల్పడిన వారిని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసి కారకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - గండేపల్లి, కరప

మండలంలో అన్ని గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు సిబ్బంది పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిఎల్పిఒ బాలమణి అన్నారు. సోమవారం మండలంలోని నీలాద్రిరావుపేటలో చెత్త సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుధ్యంపై ప్రత్యేకమైన దృష్టి సారించాలన్నారు. మార్చి నెలాఖరుకి ఇంటి, కులాయి పన్నులను 90 శాతం వసూలు చేయాలని, లేనిపక్షంలో సిబ్బందికి సోకజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్డి, కార్యదర్శులు పాల్గొన్నారు. కరప మండలంలో ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేసే విధంగా కార్యదర్శులు కృషి చేయాలని ఇఒపిఆర్డి సలాది వెంకట శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు ఆదాయ వనరులుగా ఉన్న ఇంటి, పన్నేతర వసూళ్ల త్వరతగతిన వసూలు చేయాలన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ, ఎస్డబ్ల్యుపిసి కేంద్రాలకు చెత్తను తరలించి కంపోస్ట్ తయారీ, డ్రెయినేజీలు పూడికతీతలు, వీధులు పరిశుభ్రత, డ్రింకింగ్ వాటర్ పనితీరు మొదలగు అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



పవన్తో పెండెం దొరబాబు

డిప్యూటీ సిఎంతో పెండెం భేటీ

ప్రజాశక్తి - పిఠాపురం

మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్తో సోమవారం భేటీ అయ్యారు. గత ఏడాది ఆగస్టులో ఆయన వైసిపి రాజీనామా చేశారు. రాజీనామా అనంతరం ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూనే వచ్చారు. దొరబాబు ఏ పార్టీలోకి వెళతారనే ఆసక్తి ప్రజల్లో నెలకొంది. కూటమి పార్టీల నుంచి ఆహ్వానం ఉందని గతంలోనే ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన పవన్ కల్యాణ్ను మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిశారు. భవిష్యత్ రాజకీయ ప్రయాణంపై చర్చించినట్లు సమాచారం. జనసేన లో చేరేందుకు దొరబాబు ఆసక్తి వ్యక్తం చేయగా అందుకు అధినేత పవన్ అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది.

మద్యం మత్తులో కొట్లాట

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మద్యం మత్తులో ఇరువర్గాల కొట్లాటలో ముగ్గురు గాయాల పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఊట బుజ్జి చేబ్రోలులోని ఓ కళ్యాణ మండపం దగ్గర వివాహానికి వచ్చాడు. పెండ్లికొడుకు వివాహ వేదిక వద్దకు రాకపోవడంతో తీసుకురావడానికి గొల్లప్రోలు బయలుదేరి వస్తుండగా మార్గ మధ్యలో దడాల సతీష్, లింగం అర్జున్ మద్యం మత్తులో అతనితో ఘర్షణ పడ్డారు. వెంటనే ఊటా బుజ్జి తన అన్నయ్య మేనల్లుడు శ్రీను, గణేష్ని పిలిచాడు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.ఈ కొట్లాటలో ఊట బుజ్జి అన్నయ్య మేనల్లుడు శ్రీను, గణేష్కు రక్తపు గాయాలయ్యాయి దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

పురపాలక భవనాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - కాకినాడ

159 సంవత్సరాల చరిత్ర కల్గిన కాకినాడ పురపాలక పూర్వ సమావేశ మందిరాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పురపాలక మందిర భవనం బూత్ బంగ్లాగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని శక్తులు రాత్రివేళల్లో కార్యాలయం లోపల అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారని అన్నారు. పురాతన భవనం రాతితో నిర్మించడంతో ఆ కట్టడం చెక్కు చెదర లేదని, పై కప్పు శిథిలావస్థకు చేరిందన్నారు. ఇలాగే వదిలేస్తే వర్షాలకు పైకప్పు పూర్తిగా నేల మట్టం అవుతుందన్నారు. దీనిపై కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు దృష్టి సారించి పురాతన కట్టడాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కవిసంధ్య కవితల పోటీల విజేతలు వీరే...

ప్రజాశక్తి - యానాం

ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా యానాం కవిసంధ్య, నెల్లూరు చిన్ని నారాయణరావు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కవితల పోటీకి సంబంధించిన విజేతలను కవిసంధ్య అధ్యక్షుడు, పోటీల కన్వీనర్ దాట్ల దేవదానంరాజు ప్రకటించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా నూజివీడుకు చెందిన డాక్టర్ జడా సుబ్బారావు, సిద్దిపేటకు చెందిన పర్కపల్లి యాదగిరి, దుబ్బాకకు చెందిన ఐలేని గిరి రాసిన కవితలు ఎంపికయ్యాయని తెలిపారు. అలాగే ప్రోత్సాహక బహుమతులకు శ్రీకాకుళంకు చెందిన వినోద్ గుప్తం, మానేపల్లికి చెందిన మోకా రత్నరాజు, గోకవరానికి చెందిన జెడి.వరలక్ష్మి, నిజామాబాద్కు చెందిన కళా గోపాల్, అదిలాబాద్కు చెందిన బి.వేణుగోపాల్ రెడ్డి, యానాంకు చెందిన పొనుగుమట్ల అశోక్కుమార్, విజయవాడకు చెందిన బివి.శివ ప్రసాద్, హైదరాబాద్కు చెందిన పిన్నంశెట్టి కిషన్, నిర్మల్కు చెందిన తుమ్మల దేవరావు, అదిలాబాద్కు చెందిన ఉదారి నారాయణ రాసిన కవితలు ఎంపికయ్యాయన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా కోడూరి విజయకుమార్ వ్యవహరించారు. విజేతలకు హైదరాబాద్లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో మార్చి 23న జరిగే సభలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

సునీల్కుమార్ సస్పెన్షన్ను ఎత్తివేయాలని ర్యాలీ

ప్రజాశక్తి - తుని

ఐపిఎస్ పివి.సునీల్కుమార్పై సస్పెన్షన్ వేటును ఎత్తివేయాలంటూ తుని పట్టణంలో సోమవారం కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దళిత మహిళలు, ప్రజా సంఘ నాయకులు, దళిత ప్రజా ప్రతినిధులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. తుని పట్టణం వీరవరపుపేట నుంచి గొల్ల అప్పారావు సెంటర్ వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. ఎఐఎం ప్రతినిధి కె.దిలీప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దళిత అధికా రులపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. అనుమతులు తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా విదేశీయులకు వెళ్లారనే కారణంతో ఆయనను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. సర్పంచ్ జగటాల వీరబాబు మాట్లాడుతూ

ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దళిత అధికారుల స్వేచ్ఛను హరిస్తున్నారన్నారు. సునీల్కుమార్పై ఉన్న సస్పెన్షన్ను ఎత్తివేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దళితులందరూ ఐక్య ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు,ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక సాయి గణపతి ఆటో యూనియన్కి చెందిన డ్రైవర్ గొల్లపల్లి సత్యనారాయణ ఆటోలో సామర్లకోటకు చెందిన ఒక ప్రయాణీకుడు బ్యాగ్ మరచిపోయి వెళ్లిపోయాడు. ఆ బ్యాగ్లో విలువైన సర్టిఫికెట్లు, రూ.3600 నగదు ఉన్నట్లు గుర్తించిన డ్రైవర్ ఆ సర్టిఫికెట్లలో ఉన్న ఫోన్ నెంబర్కి ఫోన్ చేసి ఆటో యూనియన్ కమిటీ సమక్షంలో ప్రయాణికుని ఇంటికి వెళ్లి బ్యాగ్తోపాటు, నగదుని అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీకి కుటుంబం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో సోమవారం పట్టణంలోని రాజీవ్ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాల 6, 7 తరగతుల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆహారంలోని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభయారణ్యాన్ని సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం చొల్లంగిలోని కోరంగి పర్యాటక కేంద్రాన్ని కాకినాడ ఆదిత్య కళాశాల, త్రిపుర రాష్ట్రంలోని మత్స్య కళాశాల విద్యార్థులు సోమవారం సందర్శించారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా విజ్ఞాన యాత్రలో భాగంగా అక్కడికి చేరుకున్న విద్యార్థులకు అటవీశాఖ కాకినాడ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ పర్యాటక కేంద్రం, అభయారణ్యంలో ప్రత్యేకతలను వివరించారు. మడ అడవుల ప్రాముఖ్యత, సంచరించే వన్యప్రాణుల వివరాలను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.మహేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట, సామర్లకోట

మండలంలో ఇంటర్ సెకెండియర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పేపర్ 1 పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో మొత్తం 374 మందికి 361 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. అక్షరా కళాశాలలో 125 మందికి 122 మంది, గురుకుల పాఠశాలలో 262 మందికి 252 మంది పరీక్ష రాశారు. సామర్లకోట మండలంలో ఇంటర్ సెకెండియర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో పరీక్షలు రాసే రెగ్యులర్ విద్యార్థులు 231 మంది, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 226 మంది, ప్రయివేటు విద్యార్థులు 24 మంది వెరసి 481 మంది ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్ఛార్జ్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు చెప్పారు.

సత్కరిస్తున్న నాయకులు

ఎస్సి సెల్ అధ్యక్షునిగా కృపానందం

ప్రజాశక్తి - తుని

తుని నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులుగా తుని రూరల్ మండలం లోవకొత్తూరు గ్రామానికి చెందిన లంక కృపానందం ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ప్రకటించారు. ఈ సందర్భంగా కపానందం మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో తన నియోజకవర్గ స్థాయిలో పదవిని కట్టబెట్టిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఎస్సిలకు అన్యాయం జరిగినా వారి పక్షాన పోరాడతానని అన్నారు. ఈ సందర్భంగా కోటనందూరు మండల వైసిపికి చెందిన సర్పంచులు గరిసింగు దొరబాబు, జగటాల వీరబాబు, కో ఆప్షన్ సభ్యులు జగటాల కోటసత్తిబాబు, ఎంపిటిసి సభ్యులు కొత్తపెల్లి మాణిక్యాలరావు, వైసిపి మండల ఉపాధ్యక్షులు అనుకూల రిసార్ట్స్ సామ్యేల్, తదితరులు కృపానందాన్ని సత్కరించారు.



చెక్కు అందిస్తున శ్రీనివాసరావు

వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు కృషి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మహిళా సంఘాల సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేయాలని డిఆర్డిఎ పీడీ ఎ.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని చేబ్రోలు చైతన్య గోదావరి బ్యాంక్లో సోమవారం లబ్ధిదారులకు రుణమేల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంక్ నుంచి 110 మంది మహిళా సంఘ సభ్యులకు రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులను వ్యాపారవేత్తలుగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తుందన్నారు. బ్యాంకు నుంచి ప్రతి మహిళకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం గంటా శ్రీనివాసరావు, డిపి ఎపిఎం ఆర్.సన్యాసిరావు, ప్రియదర్శిని, గొల్లప్రోలు, చేబ్రోలు మేనెజర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

పారిశుధ్య పనుల కోసం కార్మికుల నియామకం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నం జడ్పి హైస్కూల్లో మరుగుదొడ్ల పరిశుభ్రం చేసేందుకు ఇద్దరు కార్మికులను అధికారులు నియమించారు. మరుగుదొడ్లను శుభ్రం చేసే కార్మికురాలు జీతం సరిపోవడం లేదంటూ పని నుంచి వెళ్లిపోయింది. దీంతో గత 20 రోజులుగా మరుగుదొడ్లు శుభ్రం చేసిన పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పారిశుధ్య కార్మికులను నియమించాలని విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంఇఒ, స్థానిక కూటమి పార్టీల నాయకులు, ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. 300 మంది విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులను నియమిస్తామని, ఆ లోపు ఉంటే ఒక కార్మికుడినే నియమించాలనే నిబంధన ఉందని ఎంఇఒ సమావేశం దృష్టికి తెచ్చారు. ఒక కార్మికుడికి రూ.6 వేలు మాత్రమే ప్రభుత్వం ఇస్తుందన్నారు. దీంతో మరో కార్మికునికి అవసరమైన జీతాన్ని గ్రామస్తుల నుంచి చెల్లిస్తామని కూటమి పార్టీల నాయకులు తెలిపారు. దీంతో గతంలో పనిచేసిన కార్మికురాలితోపాటు, మరో కార్మికురాలిని గ్రామస్తులు నియమించుకున్నారు. ఈ సమావేశంలో సర్వ శిక్షాభియాన్ ఇఇ వెంకటరాజు, ఎంఇఒ ఇ.ప్రభాకర శర్మ, హెచ్ఎం మల్లీశ్వరరావు, ఎస్ఎంసి ఛైర్మన్ చక్రపాణి, మన్యం చిన్న, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన



కీ॥శే॥లు శ్రీమతి సోమాని వెర్రమ్మ
W/o. సుబ్బారావు (లేటు)
కీ॥శే॥లు శ్రీ సోమాని సుబ్బారావు
S/o. గంటయ్య (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, ఓడలరేవు గ్రామ కాపురస్తులు సోమాని సత్యనారాయణ, S/o. సుబ్బారావు గారు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

మా అమ్మగారు సోమాని వెర్రమ్మ ఓడలరేవు గ్రామంలో మా ఇంటి వద్ద 17-03-1996 సంవత్సరం, మా నాన్న గారు 10-04-2000 సంవత్సరంలో ఓడలరేవు గ్రామం మా ఇంటి వద్ద మరణించారు. వీరి ఇరువురి మరణం గ్రామపంచాయతీ రికార్డ్సులో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల 10 రోజుల్లో తెలియజేయగలరు.

ఇట్లు: సోమాని సత్యనారాయణ
S/o. సుబ్బారావు, 8-48, మరిడమ్మ సెంటర్, ఓడలరేవు, అల్లవరం మండలం, సెల్: 9491436047